


# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 22 2025 | సంపుటి : 2 | సంచిక : 48 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## త్వరలోనే
## స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

◆ ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు
◆ జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం

**హైదరాబాద్,నవంబర్21**
65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.



## స్పోర్ట్స్ విజేతలతకు
## సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,నవంబర్21**

4వ ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో రికార్డ్-బ్రేకింగ్ మెడల్స్ సాధించిన తెలంగాణ అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాలకంటే అత్యధికంగా 230 పతకాలను తెలంగాణ సాధించింది. నవంబర్ 15న ఒడిశాలో జరిగినఈ పోటీల్లో తెలంగాణలోని 23 సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.. దేశవ్యాప్తంగా ఈ జాతీయ క్రీడా పోటీల్లో 22 రాష్ట్రాలలోని 499 సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఇందులో వ్యక్తిగత ఈవెంట్లు - 15, జట్టు ఈవెంట్లు 07, తెలంగాణ తరపున ఈ జాతీయ ఈవెంట్‌లో 23 పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను తెలంగాణ విద్యార్థులు ప్రదర్శించారు.మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకున్నది .



## ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపినందుకే కక్షసాధింపు

» కెటిఆర్‌పై విచారణకు అనుమతి ఇందులో భాగమే
» మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్,నవంబర్21 :**
అనునిత్యం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్ష సాధిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు.

2 లో




## స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ

» తెలంగాణలో భారీగా ఐపిఎఎస్‌ల బదిలీ
» పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం

**హైదరాబాద్,నవంబర్21 :**
తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్దంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది.

## రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

» నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు
» భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా
» నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు
» మీడియ సమావేశంలో కెటిఆర్ విమర్శలు




02

## హైదరాబాద్ చేరుకునన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

▪ స్వాగతం పలికిన గవర్నర్, సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్21 :**
ఒకరోజు పర్యటనకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు.





2లో..

## స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హైదరాబాద్,నవంబర్21**
ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు.

## దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

- ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్

**న్యూఢిల్లీ,నవంబర్21 :**
దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది.



2లో..

## అబద్దాల ప్రచారంలో
## కెటిఆర్ దిట్ట

» గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం
» ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట
» గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటయింపులు
» ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు
» కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



2లో

**హైదరాబాద్,నవంబర్21 :**
పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## పత్తి, సోయాబిన్ కొనుగోళ్లలో నిర్లక్ష్యం



మిగతాది 2లో

» అఖలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన
» జాతీయ రహదారి 44 పై ధర్నా

**ఆదిలాబాద్,నవంబర్21 :**
ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి ,సోయాబిన్ కోనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.



2లో..

## బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

కోల్‌కతా పరిసరాల్లోనూ ప్రభావం


**ఢాకా,నవంబర్21 :**
పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి.




02

## ఎన్‌కౌంటర్లపై మావోల ఆగ్రహం

▪ 23న భారత్ బంద్‌కు పిలుపు
▪ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల



2 లో

## ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి కాలుష్యం

» మరింతగా క్షీణించినట్లు గుర్తింపు
» స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధింపు
» ప్రజలను హెచ్చరించిన అధికారులు

**న్యూఢిల్లీ,నవంబర్21 :**
ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంది. పలు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత నెల ఢిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని 80 శాతం ఇళ్లలో విషపు గాలి కారణంగా కనీసం ఒక సభ్యుడు అనారోగ్యానికి గురైనట్లు సర్వేలు చెబుతున్నాయి. గాలి కాలుష్యం కారణంగా ప్రజల ఆయుర్దాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు రక్షణ లభించటం లేదు. మాస్కులు, ఎయిర్ ప్యూర్గిఫైయర్లు కొంత మేరకు మాత్రమే రక్షణ ఇస్తాయని, కాలుష్యాన్ని నియంత్రించడానికి పాలసీలో మార్పులు రావాలని వైద్యులు సూచిస్తున్నారు.

# ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి కాలుష్యం

మొదటిపేజీ తరువాయి
కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధించింది. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆపేయాలని రెండు రోజుల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం అయింది. సాధారణంగా ఢిల్లీలోని స్కూల్స్ చలికాలంలో స్పోర్ట్స్ మీట్స్ కండక్ట్ చేస్తూ ఉంటాయి. కాలుష్యం పెరగటంతో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించే క్రీడలను నిర్వహించొద్దని ఢిల్లీ ప్రభుత్వం స్కూళ్లను ఆదేశించింది. ఇకపోతే ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి.

మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్‌లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు- వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం. దేశ రాజధానిలో వాయు కాలుష్యం పెరిగిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రధాన కారణం అవుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల ఉండే రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో పంట వ్యర్థాలను తగలబెడుతూ ఉన్నారు. దాని కారణంగా ఢిల్లీలో కాలుష్యం పెరుగుతోంది. అధికారులు పోలీస్ కేసులు నమోదు చేస్తున్నా.. భార్గీన్లు వేస్తున్నా కూడా రైతులు మారటం లేదు. పంట వ్యర్థాలను కాలుస్తూనే ఉన్నారు.

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి
రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్డికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది.బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.

# ఎన్‌కౌంటర్లపై మావోల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి
మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారంటూ మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అందుకు నిరసనగా నవంబర్ 23వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేసింది. పోలీసుల క్రూర హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వివరించింది.నవంబర్ 18వ తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలకు రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి.. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి తరలించారు. ఈ మృతదేహాలకు హిడ్మా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ.. జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో.. నవంబర్ 23వ తేదీ ఆదివారం భారత్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. 2026, మార్చి నెలాఖారు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించింది. మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రాబల్యం అధికంగా ఉంది. భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. ఇంకొందరు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. దేశంలో ఆ పార్టీ దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

# స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ

మొదటిపేజీ తరువాయి
డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపినందుకే కక్షసాధింపు

మొదటిపేజీ తరువాయి
ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడం కక్ష సాధింపు చర్య అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార రాజకీయదాడిలో భాగంగా కేటీఆర్‌పై ఈ కార్ రేస్ కేసును తెరపైకి తెచ్చాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీతో చీకట్లో చేతులు కలిపి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నారని, ఫార్ములా ఈ కేసులో చట్టపరమైన స్థిరత్వం, వాస్తవ ఆధారాలు, సాక్ష్యాలు లేవు, ఫార్ములా ఈ రేస్‌పై గతంలో లైడిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమని కేటీఆర్ చేసిన సవాల్‌కు రేవంత్ రెడ్డి తోకముడిచాడని ఆరోపించారు.రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరిట సాగదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నిలువరించేందుకు మరోసారి ఈ-కార్ రేస్ కేసు పేరిట కుట్రలను తెరపైకి తెచ్చిందని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుని రెండు జాతీయ పార్టీలు పని చేస్తున్నాయని ఆరోపించారు. కేటీఆర్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకే కుట్రలకు తెగబడుతున్నాయని మాజీ మంత్రి మండిపడ్డారు.దేశంలో కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో బద్ధ శత్రువులు కానీ, తెలంగాణలో మాత్రం వారిది అన్నదమ్ముల అనుబంధం అని అన్నారు. ప్రాంతీయ పార్టీలను, యువ నాయకత్వాన్ని రాజకీయంగా నిర్మూలించడం, ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఎజెండా అని ఆరోపించారు. నిన్నటికి నిన్న బీహార్‌లో ఆర్జేడీని కాంగ్రెస్, బీజేపీలు కలిసి మట్టికరిపించాయని, అలాగే యూపీలో సమాజ్‌వాదీ పార్టీని, కర్ణాటకలో జేడీఎస్‌ను, ఢిల్లీలో ఆప్‌ను, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనలను ఇంకా అనేక ప్రాంతీయ పార్టీలను పూర్తిగా బలహీన పరిచాయని గుర్తు చేశారు.దేశంలో యువ నాయకత్వం ఎదుగుదలను నిరోధించడమే మోదీ-బీజేపీల ఎజెండా. అందుకే అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, కేటీఆర్, ఉదయనిధి స్టాలిన్ వంటి యువ నేతలను బీజేపీ టా÷-గ్గ÷ట్ చేసిందని, ఉత్తరాదిలో అనుసరించిన వ్యూహాన్నే తెలంగాణలోనూ బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్నాయని, అందులో భాగంగానే తెలంగాణలో కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టేందుకు జాతీయ స్థాయిలో బద్ధ విరోధులు ఆప్తమిత్రులు అయ్యారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని బీఆర్ఎస్ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఫార్ములా ఈ- రేస్‌ను పదే పదే తెరపైకి తెస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పేరుతో కేసీఆర్‌ను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే రేవంత్, బీజేపీలు కలిసి మళ్లీ ఈ-కార్ రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి గొంతుకోసింది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, మాటమార్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేసింది. రాజ్యాంగబద్ధంగా కాకుండా, పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని బీసీ సమాజాన్ని తడిగుడ్డతో గొంతుకోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అటు బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేస్తున్నది. అందుకే డైవర్షన్ రాజకీయాలు, డ్రామాల పాలిటిక్స్‌కు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ-రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ద్రోహంపై, రేవంత్ నయవంచక పాలనపై ప్రజల్లో చర్చ జరగకుండా మీడియా అటెన్షన్ మొత్తం ఈ-రేస్ చుట్టే ఉండాలని రేవంత్ కుట్రలు చేస్తున్నాడని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

# దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

మొదటిపేజీ తరువాయి
ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనకర వాతావరణం నెలకొంది. పైలట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడా..? లేదా..? అన్నది స్పష్టంగా తెలియలేదు. కానీ, ప్రమాద తీవ్రతను చూస్తుంటే పైలట్ బతికే ఛాన్స్ లేదనే తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ తయారు చేసింది.

# అబద్ధాల ప్రచారంలో కెటిఆర్ దిట్ట

మొదటిపేజీ తరువాయి
'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్దాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మొదటిపేజీ తరువాయి
ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

# పత్తి, సోయాబిన్ కొనుగోళ్లలో నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్ -నాగపూర్ జాతీయ రహదారి 44 పై నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు నిరసన తెలిపారు. పంటల కొనుగోలులో రెండు ప్రభుత్వాలు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని నాయకులకు తెలిపారు. సీసీఐ తేమశాతం పేరిట పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో మధ్య దళారులకు విక్రయించి పత్తి క్వింటాలుకు రూ.1500 చొప్పున నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, మిగిలిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సోయాబీన్ కొనుగోలు సైతం పలు నిబంధనలు అమలు చేస్తున్నారని, వేలిముద్ర తప్పనిసరి చేయడంతో రైతులు పంటను అమ్ముకునే పరిస్థితి లేదని వాపోయారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న సోయాబిన్ పంటను మార్క్ ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన నష్టపోతున్నారని తెలిపారు. పంటల కొనుగోలులో నిబంధనలు ఎత్తివేసే వరకు ఆందోళన నిర్వహించనునట్లు అఖిలపక్షం నాయకులకు తెలిపారు. రైతుల ఆందోళన ఫలితంగా జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి.

# హైదరాబాద్ చేరుకునన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మొదటిపేజీ తరువాయి
ఐదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి ముర్ముకు సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు. తిరుపతి నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి తిరిగి శనివారం పుట్టపర్తి వెళ్లనున్నారు.

# రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు. ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములిచ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూ కేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇకపోతే రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. ఈ ఫార్ములా రేస్ కేసులో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. ఏ తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రైతుల ఆత్మహత్యపై స్పందించరేం

**- ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు పరిష్కరించరా**
**- సిఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు విమర్శలు**

ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్ రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అన్నారు. ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు,కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం నవంబర్ 22 2025

## భారత రాజ్యాంగం సమగ్రమైనది, అపురూపమైనది

# కోర్టుల పవిత్ర బాధ్యత రాజ్యాంగానికి రక్ష

**బోయిని సత్యనారాయణ, న్యాయవాది**




తమిళనాడు శాసన సభ చేసిన తీర్మానాలను ఆమోదించకుండా గవర్నర్ ఆలస్యం చేసారని, చాలా కాలం తన వద్ద పెండింగ్ లో ఉంచుకుని తర్వాత ఆ తీర్పులను రాష్ట్రపతి పరిశీలనకు పంపించారని, అయినప్పటికీ శాసన తీర్మానాలను రాష్ట్రపతి కూడా ఆమోదించడం లేదని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేసింది.

- **ఈ కేసును విచారించిన సుప్రీం కోర్ట్ ద్విసభ్య ధర్మాసనం 8 ఏప్రిల్ 2025 రోజున తీర్పు వెలువరించింది**

ఈ తీర్పు రెండు రాజ్యాంగ వ్యవస్థల్లో సంఘర్షణ వాతావరణాన్ని రేపింది.
భారత రాజ్యాంగ పుత్రికలైన శాసన,నిర్వహణ,న్యాయ వ్యవస్థల మధ్య ఒక అవాంచిత సంఘర్షణకు, ఆధిపత్య పోరుకు ఈ తీర్పు ఆజ్యం పోసింది.

- **ఇద్దరు జడ్జ్ ల ధర్మాసనం వెలువరించిన తీర్పు గవర్నర్,రాష్ట్రపతులకు తమ విధుల నిర్వర్తనకు కాలపరిమితి విధించింది**

శాసన సభలు,పార్లమెంట్ చేసిన తీర్మానాలను గవర్నర్,రాష్ట్రపతి మూడు నెలల్లో పరిష్కరించాలని గడువు విధించింది.

- **మూడు నెలల్లో గవర్నర్,రాష్ట్రపతి గనుక ఆయా బిల్లులను నియమిత మూడు నెలల గడువులోగా పరిష్కరించకుంటే ఆ బిల్లులను ఆమోదినట్టుగానే పరిగణించబడుతుందని ఆ తీర్పు సారాంశం**

కానీ మొన్నటి సుప్రీం కోర్ట్ తీర్పు పాత తీర్పును కొట్టివేసింది.
ఇక్కడే రాజ్యాంగ నిర్దేశాల పట్ల న్యాయమూర్తుల అవగాహనపై చర్చ మొదలయ్యింది.
సామాన్యునికి అర్థం కాని ఏప్రిల్ నెల తీర్పు దేశ రాజ్యాంగ ఉనికికే సవాల్ విసిరింది.
ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు శాసన వ్యవస్థలపై అజమాయిషీ కి దారితీస్తుందని న్యాయ నిపుణులు ఆందోళన వెలిబుచ్చారు.

- **అంతే కాకుండా న్యాయ వ్యవస్థ తానే రాజ్యాంగ సవరణలు చేసే అధికారాన్ని చేతిలోనికి తీసుకుంటున్నదని విమర్శలు వచ్చాయి**

ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ పక్షాలు,న్యాయ కోవిదులు తమ తమ అభిప్రాయాలు వెలిబుచ్చడం చేసారు.
ఇద్దరు న్యాయమూర్తుల ఏప్రిల్ నెల తీర్పు సామాన్యులకు అర్థం కాని బ్రహ్మ పదార్థం లాంటిదని బలమైన విమర్శ బయలు దేరింది.
ఇద్దరు జడ్జ్ ల ఈ తీర్పును సమర్థిస్తూ,వ్యతిరేకిస్తూ భిన్నాభిప్రాయాలు ప్రారంభమయ్యాయి

- **ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం హుందాగా వ్యవహరించింది.**

**సుప్రీం కోర్టు తీర్పు భారతదేశంలో కనీ వినీ ఎరుగని గందరగోళాన్ని రేపింది**

అప్పుడు భారత రాష్ట్రపతి కార్యాలయం న్యాయ కోవిదులతో, పండితులతో చర్చించింది.
న్యాయ పండితుల సూచన మేరకు ఈ రాజ్యాంగ సంక్షోభ నివారణకు రాష్ట్రపతి సుప్రీం కోర్ట్ కు Presidential refference పంపించింది.
అంటే ౚ భారత రాజ్యాంగం ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సూచన ద్వారా భారత రాష్ట్రపతి కీలకమైన చట్టపరమైన లేదా వాస్తవ ప్రశ్నలపై సుప్రీంకోర్టు సలహా అభిప్రాయాన్ని కోరిందిౚ ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక పరిణతతో రాష్ట్రపతి కార్యాలయం నిర్వహించింది.

- **ఈ విషయంలో సుప్రీం కోర్ట్ 5 గురు జడ్జ్ ల ఫుల్ బెంచ్ ధర్మాసనం ఇద్దరు న్యాయమూర్తుల తీర్పును కొట్టివేస్తూ.. మొన్న గురువారం 20 నవంబర్ 2025 రోజు ఏకాభిప్రాయంతో సమగ్ర తీర్పు వెలువరించింది**

ఈ తీర్పులు రెండూ భారత న్యాయవ్యవస్థలో ఒక అనివార్య అవాంచిత తీర్పులుగా మిగిలిపోయినప్పటికీ, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని లోకానికి చాటాయి.

- **కింది కోర్ట్ తీర్పులను పై కోర్ట్ సమీక్షించడం మనకు తెలుసు. కానీ సుప్రీం కోర్టులో తన తీర్పును తానే కొట్టివేసిన అసాధారణ సందర్భంగా మొన్నటి తాజా తీర్పు చరిత్ర సృష్టించింది**

రాష్ట్రపతికి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని సుప్రీం అత్యున్నత ధర్మాసనం తీర్పు ఇచ్చింది.
గవర్నర్,రాష్ట్రపతి శాసన తీర్మానాల ఆమోదంలో ఆలస్యం చేస్తే ఆయా తీర్పులను ఆమోదించినట్టే భావించాలనే ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పును, ఫుల్ బెంచ్ ధర్మాసనం తోసిపుచ్చుతూ ఇచ్చిన తీర్పు రాజ్యాంగ సంక్షోభ నివారణకు మార్గం చూపింది.

Presidential refference లో రాష్ట్రపతి పంపించిన ప్రశ్నలకు సుప్రీం కోర్ట్ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం జవాబులతో స్పష్టమైన తీర్పు వెలువరించింది.

- **దేశ సమాఖ్య వ్యవస్థలో గవర్నర్లు నిర్వహిస్తున్న పాత్ర పై తీవ్ర చర్చకు దారి తీసిన రాష్ట్రాల బిల్లుల ఆమోదం అంశంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక తీర్పు విలువరించింది**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మసనం తీర్పుతో పాటు ఒక సూచన కూడా చేసింది.
గవర్నర్లు తమ వద్దకు వచ్చిన బిల్లులను అకారణంగా నిరవధికంగా నిలిపి వేయడం తగదని సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

- **గత ఏప్రిల్ నెలలో ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు, కొత్తగా విలువరించిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఇది ఒక్కటే కామన్ అంశం**

ప్రెసిడెన్షియల్ రెఫరెన్స్ లో రాష్ట్రపతి పంపించిన 14 ప్రశ్నలకు సుప్రీంకోర్టు ఈ విధంగా, సమగ్రంగా జవాబు ఇచ్చింది.

**1. ఆర్టికల్ 200 కింద శాసన బిల్లుకు ఆమోదం తెలపడం లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వులో పెట్టడం లేదా బిల్లు ఆమోదాన్ని పెండింగ్ లో పెట్టి తన అభిప్రాయాలతో బిల్లును శాసనసభకు మళ్లీ తప్పి పంపడం చేయవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది**

**2. గవర్నర్ రాజ్యాంగపరమైన ఆప్షన్లను ఎంచుకునేటప్పుడు తన విచక్షణ ప్రకారము నడుచుకోవచ్చని, ఆర్టికల్ 200 కింద విధులు నిర్వహించేటప్పుడు మంత్రి మండలి సలహా సూచనలకు కట్టుబడాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది**

**3. ఆర్టికల్ 200 కింద గవర్నర్ విధులను సమీక్షించడం న్యాయబద్ధం కాదు. గవర్నర్ తీసుకున్న నిర్ణయాల్లోని మంచి చెడులను కోర్టులు సమీక్షించలేవు, జోక్యం చేసుకోలేవు. కానీ ఈ బిల్లులపై తగిన సమయంలోగా నిర్ణయం తీసుకోమని మాత్రమే కోర్టులో పరిమిత సూచనలు జారీ చేయవచ్చు**

**4. గవర్నర్ ను వ్యక్తిగతంగా న్యాయ విచారణ ప్రక్రియలోకి లాగడం, న్యాయ సమీక్ష చేయడాన్ని ఆర్టికల్ 361 పూర్తిగా నిషేధిస్తుంది అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే గవర్నర్లు బిల్లులను నిరవధికంగా వాయిదా వేసినప్పుడు సమీక్షించేందుకు కోర్టుకు అధికారం ఉంది. ఆ పరిమిత న్యాయ సమీక్షను ఒక అధికారికంగా కోర్టులు భావించకూడదని ఆర్టికల్ 361 ను ఈ విషయంలో ఉపయోగించకూడదని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది**

**5. హైకోర్టు సుప్రీం కోర్టులు గవర్నర్ల అధికార వినియోగంలో గడువు విధించడం తగదని స్పష్టం చేసింది**

**6. ఆర్టికల్ 21 కింద రాష్ట్రపతికి ఉన్న విచక్షణాధికారాలను న్యాయ పరంగా సమీక్షించడానికి వీల్లేదని తీర్పులో స్పష్టం చేశారు**

**7. ఆర్టికల్ 21 కింద గవర్నర్లు విధులు నిర్వర్తించేటప్పుడు కోర్టులు విధించిన గడువులకు రాష్ట్రపతి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్ట్ తన తీర్పులో చెప్పింది**

**8. రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్ బిల్లు పంపిన ప్రతిసారి సుప్రీంకోర్టు సలహాను కోరాల్సిన అవసరం లేదని, ఆ బిల్లుపై రాష్ట్రపతి సంతృప్తి సరిపోతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే ఏ విషయంలోనైనా స్పష్టత లేనప్పుడు దానిపై ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టుకు ప్రతిపాదన పంపవచ్చని తెలిపింది**

**9. ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్లు రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాలను సమీక్షించడం కుదరదని, బిల్లు చట్ట రూపం దాల్చకముందు ఏ రకంగానూ అందులోని అంశాలపై కోర్టులు న్యాయ విచారణ జరపడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది**

**10. గవర్నర్లు రాష్ట్రపతి నిర్వహించే విధుల పట్ల జారీ చేసే ఆదేశాల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టికల్ 142 ద్వారా ఏ కోర్టు భర్తీ చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 142 కింద గవర్నర్లు రాష్ట్రపతి ఆమోదించని బిల్లులను టు అసెంట్ అంటే ఆమోదించినట్టుగానే భావించాలనే ఉత్తర్వులు జారీ చేసే అధికారం కోర్టులకు ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది**

**11. గవర్నర్ ఆమోదం లేకుండా రాష్ట్ర శాసనసభ తీసుకొచ్చే ఏ బిల్లు చట్టరూపం దాల్చలేదని, ఆర్టికల్ 200 కింద ఉన్న గవర్నర్ పాత్రను ఇతర ఏ రాజ్యాంగ వ్యవస్థ భర్తీ చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది**

**12. ఆర్టికల్ 145 (3) ప్రకారం రాజ్యాంగపరమైన కేసు సుప్రీంకోర్టు ముందుకు వచ్చినప్పుడు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి ప్రతిపాదించాలా వద్దా అనే ప్రశ్నకు సుప్రీంకోర్టు ఎలాంటి జవాబు ఇవ్వలేదు**

**13. ఆర్టికల్ 142 కింద ఉన్న అధికారాలు చాలా విస్తృతమైనవని, దానికి నిర్దిష్టంగా సమాధానం చెప్పడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తెలిపింది**

**14. ఆర్టికల్ 131 కు వెలుపల కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారాల విషయంలో సుప్రీంకర్టుకున్న న్యాయ పరిధితో రాష్ట్రపతి ప్రతిపాదనకు సంబంధం లేదని సుప్రీంకోర్టు ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయింది**

- **అంబేద్కర్ దూరదృష్టి అసామాన్యం**

రాజ్యాంగ రచన చేస్తున్న సమయంలో కమిటీ ఈ విషయంపై చర్చ చేసింది.
కోర్టులకు శాసన వ్యవస్థలకు మధ్య సంశయము తలెత్తినప్పుడు నిర్ణయాధికారాన్ని సూచన చేసే అవకాశాన్ని, సంశయ పరిష్కారానికి సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి కి అధికారం ఇవ్వాలని కొందరు రాజ్యాంగ రచన కమిటీ సభ్యులు ఒక ప్రతిపాదన చేశారు.
దానికి బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక స్పష్టమైన సూచన చేశాడు.

- **ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వ అధినేతకు ఈ అవకాశం ఇవ్వకుండా, ప్రధాన న్యాయమూర్తికి ఈ గురుతర బాధ్యత అప్పగించడం సమంజసం కాదని ఖరాఖండిగా తన అభిప్రాయాన్ని చెప్పాడు**

ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రభుత్వ అధినేతకు లేని అవకాశం అధికారం న్యాయమూర్తికి ఇవ్వడం భావ్యం కాదన్నాడు. దీనివల్ల రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతినే అవకాశమున్నది అని అన్నాడు.
ప్రభుత్వం చే నియమించబడ్డ ఒక న్యాయమూర్తి శాసన వ్యవస్థలను శాసించే బాధ్యతలను తీసుకోకూడదని వాదించాడు.

- **మహాశయుడు అంబేద్కర్ సూచన ఇప్పటి పరిస్థితికి స్పష్టంగా సరిపోతుంది.**

**దేశ పరిపాలనకు మూలాధారమైన శాసన నిర్మాణాలను రాజ్యాంగ విధుల నిర్వహణను కోర్టులు చేతిలోకి తీసుకోవడం భావ్యం కాదని న్యాయ కోవిదులు కూడా భావిస్తున్నారు**

శాసన వ్యవస్థలు చేసే తీర్మానాల్లో రాజ్యాంగపరమైన లొసుగులపై సమీక్షించడం మాత్రమే కోర్టులకు ఉన్న అధికారమని సుప్రీంకోర్టు తాజా తీర్పుతో స్పష్టమైంది.
మన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలలో అత్యున్నతమైనదని తాజా సుప్రీంకోర్టు తీర్పు తో మరోసారి వెల్లడయింది.రాజ్యాంగం ఎంత గొప్పదైన అమలు చేసే వ్యక్తుల వ్యక్తిత్వం పైన దాని నిర్వహణ ఆధారపడి ఉంటుంది.

- **రాజకీయ నాయకుల మాదిరిగా వ్యక్తిగత భావావేశాలకు ఆధిపత్య ప్రదర్శనకు న్యాయమూర్తులు కేంద్ర బిందువు కాకూడదు.**

తమిళనాడు ప్రభుత్వం వేసిన కేసులో ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీం కోర్ట్ ధర్మాసనం ఇచ్చిన తీర్పు, నవంబర్ నెల లో సుప్రీంకోర్టు అత్యున్నత ధర్మసనం ఇచ్చిన తీర్పు ఒకదానికొకటి భిన్నమైనవి.

- **న్యాయమూర్తులు వ్యక్తిగత రాగద్వేషాలను అభిప్రాయాలను ఇలా తీర్పుల్లో జొప్పించకూడదని సర్వత్రా వినిపిస్తున్న అభిప్రాయం**

సుప్రీం కోర్టు న్యాయమూర్తుల వ్యక్తిగత అవగాహన పట్ల ఈ తీర్పులు చులకన భావాన్ని కలుగజేసే అవకాశం ఉంది. ఇది న్యాయవ్యవస్థ పవిత్రతను కూడా దెబ్బతిస్తుంది.
ఏప్రిల్ నెల తీర్పు నవంబర్ నెల తీర్పు రెండు సుప్రీంకోర్టు ద్వారానే వెలువడ్డాయి.
ఈ తీర్పుల్లో సామాన్య మానవుడు ఏ తీర్పును ప్రామాణికంగా భావించాలి.

- **ప్రజలకు అర్థం కాని న్యాయ భాష, చట్టము, న్యాయ అభిప్రాయాల వల్ల గందరగోళం ఏర్పడడం సమంజసం కాదు**

న్యాయమూర్తులు కూడా తమకు తామే సర్వోన్నతులుగా భావించుకునే ఆధిపత్య ధోరణి అభిలషనీయం కాదు.
రాజ్యాంగ భాష, న్యాయభాష సామాన్యులకు అర్థం కాదు.

- **కోర్టులు ఇచ్చే తీర్పులు, ఆ తీర్పుల్లోని భావం, భాష విన్యాసాలు చికాకు పెడితే సామాన్యుడు అయోమయానికి గురవుతాడు**

తమిళనాడు ప్రభుత్వ కేసులో గతంలో ఇచ్చిన తీర్పు, అందులోని లోతైన విషయాన్ని ఇప్పుడు అందరూ అర్థం చేసుకుంటున్నారు.
రెసిడెన్షియల్ రెఫరెన్స్ లో రాష్ట్రపతి సంధించిన 14 అంశాలను కూలంకషంగా అందరూ చదవాలి.
రాష్ట్రపతి ప్రశ్నలకు సుప్రీం కోర్ట్ ఇచ్చినటువంటి జవాబు తీర్పును కూడా సంయమనంతో అందరూ అర్థం చేసుకోవాలి.

- **భారత రాజ్యాంగం రాజకీయ వస్తువు కాదు.**

**రాజ్యాంగం పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత భారతీయులందరిపై ఉంది**

మొన్నటి సుప్రీంకోర్టు తీర్పు ప్రజల మనోవికాసానికి, రాజ్యాంగ అవగాహనకు ఒక హేతువు కావాలని అందరము కోరుకోవాలి.

**భారత రాజ్యాంగం వర్ధిల్లాలి.**
**అత్యున్నత రాజ్యాంగాన్ని భారత ప్రజలకు అందించిన అంబేద్కర్ మహాశయునికి వందనాలు.**
**జై సంవిధాన్.**

# 41 మద్యం బాటిళ్ల స్వాధీనం..

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ నవంబర్ 21**
గోవా, ఢిల్లీ నుంచి ఎయిర్ లైన్ ద్వారా తీసుక వచ్చిన ఎన్డీపీఎల్ ( నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్)ను ఎస్టీఎఫ్ ఏ టీమ్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి రోడ్డుపై తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తీసుక వచ్చిన మద్యాన్ని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపర్డెంట్ అంజిరెడ్డి తెలిపారు .



## రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ నవంబర్ 21:**
భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము శుక్రవారం నాడు హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది.రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి. శివధర్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా ఘన స్వాగతం పలికారు.



# కన్నుల పండుగగా , అంగరంగ వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామిదేవాలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఆరంభం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 21**
మహాత్మానగర్లో శ్రీ అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ దేవత విగ్రహాల ఊరేగింపు.ప్రతిష్ట మహోత్సవ వేడుకల కోసం విచ్చేసిన శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి .తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్( ఎల్ ఎం డి) గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ పుణ్యక్షేత్ర ప్రతిష్టాపన మహోత్సవ వేడుకలు శుక్రవారం రోజున కన్నుల పండుగగా, అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ అయ్యప్ప స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా శాస్త్రోక్తకంగా పూజలు



నిర్వహించి , ఆయా విగ్రహాలతో మహాత్మా నగర్ గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టారు. అయ్యప్ప నామ స్మరణతో , అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనుల సందడి మధ్య దేవత విగ్రహాల ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది. అలాగే శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రోజున ఉదయం 8:30 గంటల నుండి మంగళ వాయిద్యము, చతుర్వేదముల స్వస్తి,



పుణ్యాహవాచనము, ఆచార్యది రుత్విక్ వర్ణములు, యజ్ఞశాల ప్రవేశము, యజ్ఞశాల సంస్కారము, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాది మండల దేవతా స్థాపనములు, హోమ కుండ సంస్కారము, అగ్ని ప్రతిష్ట ప్రధాన దేవతా హోమములు, సాయంత్రం 4:30 గంటల నుండి గణపతి, నవగ్రహ, ప్రధాన దేవత మూర్తుల, మూల మంత్ర వాహనములు, పంచగ వ్యాధి వాసపూర్వక జలాధివాసము, హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వినియోగముల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ విద్యారణ భారతీయ స్వామి ప్రతిష్ట మహోత్సవ వేడుకల కోసం శుక్రవారం మధ్యాహ్నం మహాత్మ నగర్ విచ్చేశారు.శుక్రవారం రోజున ప్రారంభమైన వైధిక కార్యక్రమాలు వేదమూర్తి బ్రహ్మశ్రీ జక్కి కృష్ణావధాని ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. గురు స్వామి కావేటి పరమేశ్వర స్వామి , ఆలయ కమిటీ నిర్వాహకులు , అయ్యప్ప భక్తులు , మహాత్మ నగర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్టాపన మహోత్సవ వేడుకల కోసం తరలివచ్చిన అయ్యప్ప భక్తులు, ప్రజలకు అన్న ప్రసాద వితరణ , అల్పాహారం ఏర్పాటు చేశారు.

# ఆలయ విస్తరణ పనులకు అడ్డంకి

- దక్షిణం వైపు చేపట్టిన పనులను అడ్డుకున్న వ్యాపారస్తులు,భవన యజమానులు
- పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్
- నోటీసులు ఇవ్వకుండా పనులు చేపట్టడంపై ఆందోళన

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శుక్రవారం ఆలయానికి దక్షిణం వైపు ఉన్న వ్యాపారస్తులు, వాణిజ్య భవన యజమానులు అడ్డుకొని నిలిపివేశారు. దక్షిణం వైపు ఉన్న ప్రధాన రహదారిలో 25 అడుగుల మేర ఆలయ విస్తరణకు ప్రతిపాదనలు చేసి వినియోగిస్తుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భారీ యంత్రాలతో అధికారులు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.





రహదారిపైకి విస్తరణ పనులు రావడంతో రోడ్డు చిన్నగా మారి తమ వ్యాపారాలను, నివాసాలను కోల్పోతామని, ఇందుకు సంబంధించి రహదారి ఎన్ని అడుగులు ఉండాలో ముందుగా నిర్ణయించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో ముందుగా తమకు నోటీసులు జారీ చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా పనులు చేపడతారంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు భవన యజమానుల ఆందోళనలతో దక్షిణం వైపు రోడ్డుపై గందరగోళం నెలకొంది. దీంతో పట్టణ సిఐ వీరప్రసాద్ పోలీస్ సిబ్బందితో రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులతో మాట్లాడి అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, మీకు ఏమైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులతో కానీ, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.దీంతో చేసేదేమీ లేక కాంట్రాక్టర్ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

# విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్స్ ని వెంటనే సస్పెండ్ చేయాలి

- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 21:**
అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్స్ నీ వెంటనే సస్పెండ్ చేయాలని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలోని మండల పట్టణాలలోని షెడ్యూల్ కులాల, వెనుకబడిన తరగతుల వసతి గృహాలలోని వార్డెన్స్



విద్యార్థులకు అందుబాటులో లేకుండా వ్యక్తిగత పనులు చేసుకుంటూ, విధులకు గైహాజరవుతున్నారని, అధికారులకు మాత్రం హాజరవుతున్నట్లు చూపించుకుంటున్నారని ఆయన అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించకుండా సరిపడు భోజనం పెట్టకుండా వేసినంత తినాలి అంటూ బెదిరిస్తూ, విద్యార్థుల డొక్కలను మాడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మెనూ ప్రకారం, సరిపడు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించాలని అడిషనల్ కలెక్టర్ ని ఆయన కోరారు. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని, విద్యార్థుల వసతి గృహాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మామిడిపల్లి హేమంత్, గొడిసెల ప్రణీత్, కట్ల అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్

- విద్యార్థులకు అందించే అల్పాహారం పై ఆగ్రహం
- నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు ఆదేశం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్కృత పాఠశాలను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, భోజనం, ఫలహారాల నాణ్యత, ఉపయోగిస్తున్న సామాగ్రి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన భోజనం, అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



విద్యార్థులకు అందించే అల్పాహారం పై ఆగ్రహం



విద్యార్థులకు ఉదయం టిఫిన్ రూపేనా అందించేందుకు తయారు చేసిన కిచిడీని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. కిచిడి బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమేష్, ఆలయ ఈఈ రాజేష్, డీఈలు మధు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓ జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం వాల్ పోస్టర్ ఆవిష్కరణ .

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 21**
హోమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అన్నం పరబ్రహ్మస్వరూపం దానిని వృధా చేయడం మహా పాపం అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్ ను పాఠశాల ప్రధానాచార్యులు రాజమౌళి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలియజేశారు. ఈ సందర్భంగా



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నం వృధా చేయకూడదని ఆకలితో అలమటిస్తున్న ఎంతోమందికి అన్నాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్ని ప్రతిరోజు కోరుకోవాలని తెలిపారు. ధనపురి సాగర్ మాట్లాడుతూ భారతదేశంలో 19 కోట్ల మందికిపైగా ఒకపూట భోజనం లేక అలమటించే వాళ్ళు ఉన్నారని దీనినీ మనమందరం గుర్తుంచుకొని ఆహారం వృధా చేయకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిది అని, ఒక కేజి బియ్యం మన చేతికి రావడానికి సుమారుగా 2500 నుండి 4 వేల లీటర్ల నీళ్ళు అవసరం అవుతాయని, ఆహారాన్ని వృధా చేస్తే పరోక్షంగా మనం నీళ్లను కూడా వృధా చేసినట్టే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాజమౌళి, మహేష్, జి. శ్రీనివాస్ సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి




- TWJF ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

**కరపత్రం ప్రతినిధి ఆసిఫాబాద్ జిల్లా: నవంబర్ 21**
గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే కు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టు ల సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. సురేందర్ రావు, పర్వతి రాజశేఖర్ మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాం చందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య ల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పెండింగ్ లో ఉందని, గతం లో హెల్త్ కార్డులు ఇచ్చినా అవి ఆసుపత్రులలో అనుమతించడం లేదని అన్నారు. అక్రెడిటేషన్ ల కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర గడిసినా నూతన కార్డులు మంజూరు చేయడం లేదని, కొత్త కార్డులు ఇవ్వాలని, రిటైర్డ్ జర్నలిస్టు లకు ఫించన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు నీలి సతీష్, ఘనపురం మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుల్లూరి సంతోష్, ఉపాధ్యక్షులు ఏం. రవి, నాయకులు దాసరి లక్మన్, పిట్టల నాగేందర్, బర్ల కిరణ్, అబ్దుల్ సమీర్, బి . రాజు, బి. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## రామడుగు మండల శిల్పకళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 21**
తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ఆదేశాల మేరకు జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు చంటి శ్రీనివాస్, ఆదివాసి జాగృతి జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్ , జాగృతి సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్ ,కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . కరీంనగర్ జిల్లా రామడుగు మండలం శిల్పులకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిన ఇక్కడి కళాకారులు శతాబ్దాలుగా తమ వారసత్వ వృత్తిగా విగ్రహాలు ,దేవాలయ శిల్పాలు, సాంస్కృతిక శిల్పాలు ,చెక్కుతూ తెలంగాణ సాంస్కృతి పరంపరను నిలబెట్టారు. అంతటి కళా నైపుణ్యం ఉన్న వారు ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి వారిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని అన్నారు.రామడుగు మండలంలోని శిల్ప కళాకారులు కళాకారులుగా 50 ఏళ్ల క్రితం గుర్తించినప్పటికీ వారికి ఎలాంటి నెలవారి పింఛను రాలేదని వారికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత విద్యుత్ కల్పించి వారిని ఆదుకోవాలని అన్నారు. రామడుగు శిల్పకళ అభివృద్ధి పథకం పేరుతో వర్క్ షాపులు ,మార్కెట్ లింకులు ,ఎగుమతుల ప్రోత్సాహ కార్యక్రమాలు, ఏర్పాటు చేయాలి. రామడుగు శిల్ప కళాకారులను అధికారికంగా ప్రత్యేక కళాకారుల వర్గంగా గుర్తించి రేషన్ కార్డు, ఆర్టిస్ట్ ఐడి కార్డు ,భీమ, తదితర సదుపాయాలు కల్పించి వారి సమస్య పరిష్కరించకపోతే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వారి పక్షాన పోరాడుతామని అన్నారు.




## నిస్సహాయ వృద్ధులకు అండగా భరోసా..

- తండ్రి జ్ఞాపకార్థం వాకింగ్ స్టిక్స్,స్టాండ్స్ అందజేసిన మస్తాన్ కుటుంబ సభ్యులు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 21:**





రామగుండం రామ్ నగర్ ఉడియాకాలనీలో శుక్రవారం స్వర్గీయ మస్తాన్ జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు, భరోసా నిర్వాహకులు నిరుపేద నిస్సహాయ వృద్ధులకు నడవడానికి సౌకర్యవంతంగా ఉండాలని వారికీ వాకింగ్ స్టిక్స్ తో పాటు వాకింగ్ స్టాండ్స్ అందజేశారు. అనంతరం మస్తాన్ కుటుంబ సభ్యులు భరోస నిర్వాహకులు మాట్లాడుతూ నాన్న నిసహాయులకు మన వంతుగా సహాయ సహకారాలు అందజేయాలని, నిస్సహాయలకు అందించే సహాయం ద్వారా వచ్చే ఆనందం వెలకట్టలేనిదని, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడం మా కనీస బాధ్యత అని మాట్లాడుతూ స్వీటు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ కుటుంబ సభ్యులతో పాటు భరోసా నిర్వాహకులు, స్థానిక సంఘ సేవకులు పల్లికొండ రాజేష్, గున్నాల శ్రీనివాస్, జమీర్, కళాకారుడు, గాయకుడు గుర్రం అంజయ్యతో పాటు లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ కు గజమాలతో సన్మానం

- సన్మానించిన ట్రాక్టర్స్ యజమానులు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజమాలతో మహాలింగేశ్వర గార్డెన్స్ లో ఘనంగా సన్మానించారు. అనంతరం వేములవాడ పట్టణానికి చెందిన బిజెపి నాయకులు, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు సరిపెల్లి కార్తీక్, లిక్కిడి జితేందర్ ఆధ్వర్యంలో 50 మంది ప్రభుత్వ విప్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి విప్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..

